కథానిక

# మధురక్షణాలు

టి. వి. రత్నావళి

పెద్ద బడిభవనం దెయ్యంలా నిలబడి ఉంది. దానిని ఆనుకుని కుడివైపున పెద్ద మైదానం ఉంది. మైదానానికి ఎదురుగుండా బాల కృష్ణుని ఇల్లు. మైదానానికి ఈశాన్యమూలగా ఒక పెద్దజామిచెట్టు, నైరుతిమూల మామిడిచెట్టు, ఆగ్నేయాన్ని చింతచెట్టు పిల్లల్నందర్నీ పిలుస్తూ ఉంటాయి. పిల్లలందరు పెరిగి పెద్దవారై మనువ లెత్తుతున్నా అవిమాత్రం తరతరాలుగా నిలబడి పిల్లల్నే పిలుస్తూన్నాయి. బాలకృష్ణుడు మామిడి పిందెలు నములుతూ చెట్టెక్కి అందరికీ కాయలు రాలుస్తున్నాడు. చెట్టుక్రింద గుంపు పిందెల కోసరం పెనుగులాడుకుంటున్నారు. చింతచెట్టు క్రింద గుంపు లొట్టలేసుకుంటూ లోకాన్ని మరచి పోయింది. ఎనిమిదిన్నరకు చెట్టుక్రిందికిచేరి చెడు గుడి ఆడి, చెమటలు కక్కుతూ, చింతకాయలు, మామిడిపిందెలు తింటున్నారు. మధురక్షణాల్లో బడిసంగతి మరిచిపోయిన వాళ్ళందరికీ లీడరు బాల కృష్ణుడు.

మధురక్షణాల్ని మాయం చేయడానికి బడి గంటలు గణగణమని చెవులు గింగురుమనేటట్లు మ్రోగుతున్నాయి. పిల్లలందరు పుస్తకాలు పుచ్చుకుపరుగెడుతున్నారు. మంత్రగాడి మంత్రా లకి యంత్రాల్లాగుండే కీలుబొమ్మలలాగ బడి గంటలకందరూ బడిలో బంధింపబడ్డారు—బాల కృష్ణుడు తప్ప.

"అబ్బ! దిక్కుమాలిన గంట మృత్యువులా ప్రత్యక్షమైంది. అయినా అందరూ ఫస్టుబెల్లుకు పరుగెట్టడమెందుకు? థర్డుబెల్లుకి అందుకోలేక పోతామా?" అని బాలకృష్ణుడు చెట్టుదిగి తన చుట్టూ ఉన్న గేంగు చెదరకుండాచూసుకున్నాడు పళ్లు తింటూ.

సెకండు బెల్లుకూడా కొట్టేశారు. తన గేంగు కూడా కల్లంతవుతూ ఉంది. "అబ్బ! ఈ మూకకి చెప్పలేం!" అని సణుక్కుంటూ ఎదురుగుండా ఉన్న యింటికి పుస్తకాలకోసరం బయలుదేరాలని చూస్తున్నాడు.

గడియారంలో పదిగంటలుకొట్టాయి. కళ్లల్లో కట్టేసుకున్న కాగితాలకట్టల్ని కదిలించి మైదానం కేసి ప్రసరించాడు కళ్ళని కాంతారావు. కొడుకు చింతచెట్టుమీదికి రాళ్ళు రువ్వుతున్నాడు. బాల కృష్ణుడు ఎంత అల్లరివాడైపోతున్నాడు! బడంటే బద్ధకం. చదువంటే నిద్ర. ఎంత అందంగా అల్ల రితో కాలక్షేపం చేస్తున్నాడు! చీకూ చింతాలేని జీవితం. బాధ్యత భారంలేని బాల్యం మళ్ళీరాదు కదా! కళ్ళముందరి కట్ట రెప్పల్ని బరువెక్కిం చింది. బాలకృష్ణుని చిలిపిముఖం అతణ్ణి ముగ్ధుణ్ణి చేసి, రెప్పల బరువుని లాగిపారేసింది. ఔను! తనూ చిన్నప్పుడు అంటే కొడుకు ఈడప్పుడు పన్నెండేళ్ళప్పుడు అలా పొలాల గట్లలో తిరు గుతూ, ఎడ్లని బెదిరిస్తూ, రైతులమీద రంకెలేస్తూ చేలల్లో చెడుగుడి ఆడుకుంటూ అల్లరిచిల్లరగా తిరిగేవాడు. ఎంత ఆనందంగా ఉండేది? నాన్న చదువుకోమని సాధించినా లక్ష్యపెట్టేవాడు కాదు. ఆటలాడుకుంటూ మధురక్షణాల్లో మైక మెక్కి తన్మయుడైపోయేవాడు. ఇప్పుడు అమ్మ ఆదరించి మళ్ళీ గడ్డ పెరుగేసి అన్నంపెట్టదు. నాన్న చదువుకోమని సాధించడు. చేలగట్లు చెడుగుడి ఆడమని కవ్వించవు. మధుర క్షణాలు మరిరావు! మరిచిపోవాల్సిందే! తను తండ్రి పాత్ర ధరించి తన ఆకారంలోనున్న "బాల"ని చదువుకోమని సాధించాలికదూ! ఔను మధురక్షణాల్ని మసిపూసి మారేడుకాయ చేసి చదువుకోమని సాధించాలి... లేకపోతే... మళ్లీ తనలాగే గుమాస్తాగిరికి స్వాగతం చెప్పాల్సి వస్తుంది. గుమాస్తా సంకెళ్ళలో గింజుకుపోతూన్న తన జీవితంలాగ తన కొడుకు జీవితం జీర్ణంకాగూ డదు. వీల్లేదు, నల్లమందు నిషాలో నవ్వేలాగ బాల్యంలోని మధురక్షణాలు బానిసగా తయారు

చేస్తాయి. కళ్ళముందరి కాగితాల కట్టలు అతని హృదయాన్ని కదలించేశాయి. కొడుకుని కొప్పడాలని కాగితాలన్నీ కట్టకట్టి ఆఫీసుకి మోసుకుని వెళ్ళవలసిన సరంజామంతా సవరించుకుని వీధి వరండాలో కొచ్చాడు. అప్పుడే ఆవిడగారి చేతుల్లో బాలకృష్ణుడు వెన్నదొంగలా దొంగ చూపులు చూస్తూ ఏమీ ఎరగని అమాయకుడిలా బంధించబడి ఉన్నాడు. వెనక్కాల ఒక ముప్ఫై యేళ్ళ ముదిత, మెటికలు విరుస్తూ తిట్టిపోస్తూంది నోటికొచ్చినట్లూను. ముదిత వెనక్కాల పదేళ్ళ అమ్మాయి పరికిణీ చొక్కా తొడుక్కుని వెక్కి వెక్కి ఏడుస్తూంది కళ్లువాచిపోయేటట్లు. నెత్తురు చిమ్ముతూన్న నెత్తిమీది గాయం నేరాన్ని నిరూపిస్తూంది. సాక్షి సావకాశంగా నేరాన్ని నిరూపిస్తూంటే, ఆవిడగారు ఆలకిస్తూంది. తనను చూసి మరీ మండిపడింది. "మళ్ళీ యిలాంటి దుండగపు పనులు చేస్తే దుమ్ములు రేగ్గొడతా"నని దుమ్మెత్తి పోసింది.

"ఏమిరా?" అని కళ్లెర్ర జేసా!

చింతకాయలు కొట్టుకుంటూంటే, తగిలిందని తనేమీ ఎరగనని మొరబెట్టాడు బాల.

"ఆవిడ ఎదురుగుండా మరెప్పుడు అలాంటి పనులు చెయ్యొద్దని నాలుగు బాదా! ఆవిడ మనసు తృప్తిపడింది. పిల్ల ఏడుపు మానేసింది కసిదీర్చుకున్నాగదా!" అని పిల్లని చేత్తో పుచ్చుకుని విసురుగా వెళ్ళిపోయిందావిడ. భయపెట్టి బళ్లోకి పంపించి, నాలుగు మెతుకులు నోట్లో వేసుకుని కట్టల్ని కౌగలించుకుని ఆఫీసుకి హాజరయ్యాడు. అప్పటికప్పుడే ఆఫీసరు ఆజ్ఞలు హాహాకారాలు చేస్తూ ఆహ్వానిస్తున్నాయి. అడుగుల్లో అడుగు లేసుకుంటూ వెళ్లి నిలబడ్డాడు.

ఫైళ్ళు పట్టుకురమ్మని అధికార స్వరంతో ఆజ్ఞాపించాడు. వర్కంతా వప్పజెప్పి ఆఫీసర్ని జోకొట్టి జోలపాటపాడి సాయంత్రం ఇంటికొచ్చేటప్పటికి మనస్సు శాంతపడింది. సాయంత్రం చల్లబడింది. అబ్బాయి అల్లరిలో ఐక్యమై మైదానంలో ఆడుకుంటున్నాడు.

ఏళ్ళు వేళ్ళమీదినుంచి లెక్కపెట్టుకుంటూ వెళ్లిపోతున్నాయి. జీవితాలు శిథిలాలయాలలో జీర్ణించుపోతున్నాయి. భూచక్రంచుట్టూ ఊహారేఖలు ఉరకలేస్తున్నాయి. సంవత్సరాలు సంగీతం పాడుకుంటూ, సాహిత్యాలు చదువుకుంటూ, సంఘాన్ని సాగదీస్తూ, నటీనటులతో నాట్యం చేస్తూ సాగిపోతున్నాయి. బాలకృష్ణుడు కాలేజీలో చదువుకుంటున్నాడు.

కాగితాలు కళ్ళముందేసుకొని కాంతారావు గారు కుర్చీలో కూర్చున్నారు భోజనంచేసి తమలపాకులు నవులుతూ. గంట ఎనిమిదిన్నర అయిఉంటుంది. మెల్లిగా పిల్లకుసులేసుకుంటూ తలపాగా పెద్దమనిషి స్వయంగా తనకి తనే అతనికి పరిచయం చేసుకుని సంబంధంవిషయం కదలేసాడు. కాగితాల కట్టల్ని చూసిచూసి అతనికి బాలకృష్ణుడికి సంబంధం చూడాలనిగాని, పెళ్ళి చెయ్యాలన్న తలం పేరాలేదు. సందర్భంగా సమాధానంచెప్పి వచ్చిన పెద్దమనిషిని సాగనంపాడే కాని సంబంధ విషయం అతనికి ఒకవిధమైన కదలికని తెచ్చింది. బాలకృష్ణుడు అప్పుడే ఎంత వాడై పోయాడూ? భోజనాలుచేసి రాత్రి తను తాంబూలం నములుతూ కాగితాలకట్టముందు కూర్చుంటే ప్రక్కనేతల్లి ఒడిలో తలదాచుకుని మధురక్షీరాన్ని గ్రోలుతూ దోబూచులాడే బాలకృష్ణుడికి పెళ్ళా? ఉత్త... అల్లరివాడై పోయాడు. ఆవేళ పదేళ్ళపిల్లని రాయుచ్చుకు కొట్టాడు. ఎంత అప్రతిష్ఠ! కాలేజీకి వెళ్ళాక మరీ రౌడీలా తయారయ్యాడు. సిగరెట్లు! సినిమాలు! ఒకటేమిటి? ఆఖరికి వీడు ఎందుకూ పనికి రాకుండా పోతాడేమో? వాడి పుస్తకాలనిండా కాలేజీ ఆడపిల్లల ఫోటోలే? ఇప్పుడే పెళ్ళి చెయ్యకపోతే లాభంలేదు. అయినా... పెళ్ళి చేస్తే... ఇంకా చదువైనా పూర్తి కాలేదు. ఉద్యోగంలేందే పెళ్ళేమిటీ? అయినా వేసవి శలవుల్లో పరీక్షలైపోతాయిగదా! రిజల్ట్సు వచ్చాక ఉద్యోగమిప్పించి పెళ్ళిచేస్తే వాడికాపరంవాడు సుఖంగా చేసుకుంటాడని నిశ్చయించుకున్నాడు. తనకలాగే స్కూలుఫైనలు అవగానే నాన్న పెళ్ళి చేసేసాడు. సంసారభారం నెత్తిమీదవేసి చల్లగా సాగనంపాడు. కాలేజీ జీవిత మధురక్షణాల మాధుర్యం కలలోని అణిగిపోయింది. తను కాలేజీలో చదివిన మొదటిసంవత్సరం! ఎంత enjoy చేసాడు. అడుగులోనే హంసపాదులా ఆర్నెల్లకు

నాన్న పోవడం, సంసారతాపత్రయం నెత్తిన పడడం! ఉద్యోగం చెయ్యందే ఇంట్లో గడవక పోవడం!! అన్నీ అలా జరిగిపోయాయి. కొడుకు నైనా కాలేజీచదువు చదివించి ఆఫీసర్ని చెయ్యాలి. అప్పుడుకాని వాడికి పెళ్ళిచెయ్యనని అనుకున్నాడు. జీవితమాధుర్యంలోని మధురక్షణాల్ని కలుగజేస్తూ వచ్చాడు. కొడుకు కాశీలో ఇంజనియరింగు ప్యాసై వచ్చాడు. కొడుకుని చూసుకుని కొండెక్కాడు కాంతారావు. కొడుకు పెద్దవాడైనట్టు అప్పుడనిపించిందతనికి. సంబంధాల కోసరం తాపత్రయపడ్డాడు. జాబితా పెట్టి సంబంధాలన్నీ ఎకరువు బెట్టాడు. బాలకృష్ణుడు మాట్లాడలేదు. ఎప్పుడూ యింతే! ఉత్త...అల్లరి వాడు. పెద్దవాడైనా అల్లరి, పెంకితనంమాత్రం పోలేదు. వాడిచూపు ఏవైపునుందో కూడా తెలియదు! చిన్నప్పటినుంచీ దుడుకుతనంతప్ప... మంచీచెడ్డా ఏమీలేదు...ఇంక రెండునెలల్లో తను రిటైరైపోతున్నాడు...వీడికి ఏమీ తెలియదని సణుక్కుంటూ ఆఫీసునుంచి ఇంటికిచేరాడు. ఇంట్లోకి ప్రవేశించాడు.

సావిట్లో ఇద్దరు ముగ్గురు స్త్రీల సంభాషణ వినిపిస్తూంది. ఆవిడగారు హడావిడిగా తిరుగుతూంది. కొడుకొక్కడూ మేడమీది గదిలో నిశ్చింతంగా నిద్రపోతున్నాడు. ఆవేళ ప్రత్యక్షమైన తలపాగా ఆసామీయే మళ్ళీ సాక్షాత్కరించాడు. పెళ్ళి విషయం ప్రస్తావించాడు. అబ్బాయి నడిగి ఒకరోజున బయలుదేరి వస్తామని చెప్పాడు. అసలు అబ్బాయికి ఒక్క సంబంధమూ నచ్చడంలేదు. ఇంతకీ వాడితో ప్రస్తావించి మెల్లగా నచ్చచెప్పి తీసుకునివస్తానని చెప్పి సాగనంపాలని చూశాడు తండ్రి.

"చూపు లనవసరమండీ! పెళ్ళికొడుకు, పెళ్ళికూతురు ఎప్పుడో కాలేజీలో చూసుకుని ప్రేమించుకున్నారు. ఉద్యోగమైతేనే కాని చేసుకోనన్నాడు. అందుకని ఇన్నాళ్ళు ఆగాము" అన్నాడు ఆ ఆసామీ.

బిత్తరపోయాడు కాంతారావుగారు. అంత నాటకం మళ్ళీ తన నెత్తిన నెందుకో? ఏమిటి? అమ్మాయిని అబ్బాయి, అబ్బాయిని అమ్మాయి కాలేజిలోనే ప్రేమించుకొన్నారా? వీడుఉత్త... అల్లరివాడు... వీడింక- ఈ అల్లరి తగ్గదు... ఎన్నేళ్ళొచ్చినా వీడికి యింతే? అల్లరికి అంతులేదు. పుస్తకాల్లో కాలేజీ ఆడపిల్లల ఫోటోలు చూసినప్పుడే అనుకున్నా! వీడి వేషమంతాను. నయం యింకా ఏవో అక్షరం ముక్కలబ్బాయి! లేకపోతేనా?... ఎంతనగుబాటు! అని ఆలోచిస్తుండగానే నిద్రలేచి వచ్చాడు బాలకృష్ణ. సంగతంతా కనుక్కున్నా! "ఆపిల్లనితప్పఇంకెర్నీ చేసుకోనని" కచ్చితంగా చెప్పేసాడు. చేసేదేమీ లేక ఒప్పుకున్నాడు. ఇంతకీ పిల్ల అందంగానే ఉంది. ఇంత చదువుకుంది. చక్కగా పాడుతుంది ఇంకేం కావాలి అబ్బాయికి!

"తండ్రిలేని పిల్లా!...ఇంతకీ నియోగులా? తల్లి మేస్టరుటగా?"

"అయినా ఆ పిల్ల తల్లి రెండోపెళ్ళి చేసుకుందిటగా! అప్రతిష్ఠ!" అని అందుకుంది తల్లి.

అయినట్టే యిక పోనీ కట్నమన్నా... కాసన్నా లేదాయే!..ఈ సంబంధం వీడికెక్కడొచ్చిందో? నిర్భాగ్యుడికి ... మంకుపట్టు... తా మునిగింది గంగ, తావలచింది రంభ అని సణుక్కుంటూ చేసేదేమీలేక ఒప్పుకున్నాడు. కాలేజీలో చదువుతూన్నప్పుడు ఎన్నో గొడవలు జరిగాయట! మన శూరాగ్రేసరుడు కాశీవెళ్ళే ముందు చెయ్యికోసుకొని రక్తంతో "నిన్నుతప్ప ఇంకెవర్నీ పెళ్ళిచేసుకోను!" అని రక్తాక్షరాలు ప్రమాణాలు రాసియిచ్చి మరీ వెళ్ళాడట! ఎంత వాదయ్యాడో! సుపుత్రా! కొంపతీయకురా" అని వీడికి ఏం పొయ్యేకాలం వచ్చిందో! వేలకివేలు కట్నాలిచ్చి చక్కనిచుక్కల్ని కాళ్ళముందు పడేస్తూంటే...!

ఈ కాలంవాళ్ళ కేమీ చెప్పలేం బాబూ! మాట్లాడితే మరచిపోలేని మధురక్షణాలని కలవరించడం! కథలు వ్రాయడం అంతా పిచ్చి మా లోకం.

పెళ్ళి జరుగుతూంది. మనోహరమైన మధుర క్షణాల్ని మందహాసంతో చూపిస్తున్నారు. కాంతారావుగారు కోడల్ని పెద్దకళ్లు చేసుకుని పరికిస్తున్నాడు. కోడలి కేవిధమైన లోటూలేదు. పిల్ల మతాబులా వెలిగిపోతూంది. పైగా చదువు

కున్న పిల్ల. అని మురిసిపోతూండగా కణతకి కొద్దిగా పైన నుదిటిమీద మచ్చ కనబడింది. ఈ చిన్న మచ్చ లేకపోతే ఎంతబాగుణ్ణు? అనిపించింది కాంతారావుగారికి.

“కోడలు చక్కగా ఉందా?” అని పలకరించింది వియ్యపురాలి చెల్లెలు వీరమ్మ.

నుదుటిమీది మచ్చ లేకుండా ఉంటే ఎంత బాగుణ్ణు? అని చూస్తున్నానన్నా డాయన. ఏదైన ఒకవంక కనిపిస్తుందా? చూద్దామా అని వెతుకుతూ.

“మీరు తెచ్చిపెట్టుకున్నదేగా ఆ మచ్చ! మీ అబ్బాయి పదేళ్ళక్రిందట చింతచెట్టు చాటునుంచి రాయి విసరకపోతే ఎంత బాగుణ్ణు? ఈ మచ్చకూడా ఈ పిల్లకి ఉండేదికాద”ని చెప్పింది వియ్యపురాలు. విస్తుపోయాడు వియ్యంకుడు, కథ విని ముక్కుమీద వేలేసుకున్నారు ముత్తైదువలు. ఆ మధురక్షణాలు జ్ఞాపకానికి వచ్చాయి. ఔను! ఆవేళ ఆ పిల్లకి ఎంతగాయం తగిలింది! “అందరూ పూలతో బంతు లాడుకుంటే మీ అబ్బాయి రాళ్లతో రత్నాలతో బంతులాడాడు!” అని పక్కనుంచి వినిపించిందొక సన్నని కంఠం.

అబ్బాయిచేతికి కంకణం కట్టడానికి వాచీ విప్పాడు - వాత ప్రత్యక్షం! చెయ్యి కోసుకుని రక్తాక్షరాలతో ప్రమాణం చేసాడు పెళ్ళికొడుకు అవేనా మధురక్షణాలు! తీయనితలపులా? ప్రణయబాధలా? ఏమి టిదంతా! ఆవలించాడు తండ్రి.

కోయంబత్తూరులో కొడుకు ఆఫీసరు. కాంతారావు రిటైరై కొడుకుదగ్గరే ఉండిపోయాడు. సంధ్యావార్చుకుని జపంలోంచి కళ్ళు విప్పాడు తను. ఉదయభానుని అరుణకిరణాలు అబ్బాయి మీదపడి ఆడుకుంటున్నాయి. అబ్బాయి ఉంగలు కొట్టుకుంటూ అరుణకిరణాల్ని అందుకుంటున్నాడు. కొడుకు ఈజీచైరులో పడుక్కొని సిగరెట్టు తాగుతున్నాడు. నిశ్చింతగా కోడలు కాఫీ అందిస్తూంది. మళ్ళీ మధురక్షణాలు మందహాసం చేసాయి.

పాతిక సంవత్సరాలక్రితం పాలుత్రాగుతూ తల్లి ప్రక్కలో ఉంగలుకొట్టిన బాలకృష్ణుడు చింతచెట్టుక్రింద అమ్మాయిలమీద రాళ్ళురువ్విన బాలకృష్ణుడు కాలేజీచదువులో రక్తాక్షరాలు రాసుకున్న బాలకృష్ణుడు... ప్రేమతో పెళ్ళి పీటలమీద కూర్చున్న బాలకృష్ణుడు... మళ్ళీ మధుర క్ష ణా లు... బాలకృష్ణుని భాగ్యదేవత, భారతదేశపు భావిపౌరుడు ఉయ్యాలలో ఉంగ లేస్తున్నాడు. మధుర క్షణాలు పరావర్తనంచెంది, పలకరించాయి. ఇంక ఒక్కటే మధురక్షణం... మిగిలింది. బాలకృష్ణుడు చేత్తో...భక్తిగా నిప్పు పెట్టడం.

---

పురాణమీమాంస

# పశ్చాత్తాపం

శంకరగంటి రంగాచార్యులు

అశోకవనంలో సీత చాలా రాత్రులు నిద్ర రాకుండా కళ్ళు తెరచుకొనేవుంటూ, ఒకనాడు తనకుకూడా తెలియకుండా మైమరచి నిదుర పోయింది.

* * *

అశోకవనంలో దుఃఖభారంతో కృంగిపోతున్న కాలంలో సీతకు అడుగడుక్కూ లక్ష్మణుడే జ్ఞాపకానికివస్తాడు. ఏమి కారణమో ఏమో కాని, ఎప్పుడూ రామచంద్రుణ్ణి తలంచుకుంటూవుంటే కూడా, అడుగడుక్కూ లక్ష్మణుడు వచ్చి తన కన్నుల ఎదుటనిలచినట్లూ, కన్నీళ్లునిండిన కళ్లతో “వదినా! ఇలాగు మీరు నాకు చెప్పవచ్చునా?” చూపుతోనే చెప్తూమాదిరిగాను తోస్తుంది. ఇది ఆమెకు సహింప సాధ్యంకాలేదు. రావణాసురుని నిర్బంధములో పడే దుఃఖానికన్నా ఇది ఆమెను అధికంగా బాధించింది. “అయ్యో! తమ్ముణ్ణి అనరాని మాటలని ఒక దోషమూ ఎరుగని వాడి మనస్సును గాయపరిచానే! రాక్షసుడు నన్ను